దివ్యాంగులపై దయ ఏదీ?

కళ్లు కనిపించక ఇళ్లకే పరిమితమై జీవితాన్ని భారంగా గడుపుతున్న దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది. పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు సాకులను వెతుకుతుండగా వైకల్యాన్ని నిరూపించుకోవాల్సిన దుస్థితిని కళ్లు కనిపించని అంధులకు ప్రభుత్వం కల్పించింది. దివ్యాంగ పింఛన్ల లబ్ధిదారులు అక్రమ మార్గంలో పింఛన్‌ను పొందుతున్నట్లుగా చిత్రీకరించి తమ అవయవాలను రీ వెరిఫికేషన్ చేయడంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లకు పైగా పింఛన్ తీసుకుంటుంటే ఇప్పుడు తనిఖీలు చేయడమేమిటని నిలదీస్తున్నారు.



చూపు కనబడక పింఛన్ తీసుకుంటున్న వారి కళ్లను పరీక్ష చేస్తున్న వైద్యురాలు

- దివ్యాంగులకు కూటమి ప్రభుత్వం పరీక్షల శిక్ష
- రీ వెరిఫికేషన్ పేరుతో వేధింపులు
- అవస్థలు పడుతున్న దివ్యాంగులు

నూజివీడు: గత పది రోజులుగా నూజివీడులోని ఏరియా ఆస్పత్రివద్ద నేత్ర సంబంధిత సదరం సర్టిఫికెట్లతో పింఛన్లను పొందుతున్న లబ్ధిదారులను వారం రోజులుగా తనిఖీ చేస్తున్నారు. నేత్ర వైద్యురాలిని ప్రభుత్వం నియమించి పింఛన్‌దారుల కళ్లను పరీక్షిస్తున్నారు. అసలే కళ్లు కనబడక ఇబ్బందులు పడుతుంటే నియోజకవర్గ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రికి రప్పించి రీ వెరిఫికేషన్ పేరుతో వీళ్ల అంధత్వ శాతం ఎంత, నిజంగా కళ్లు కనబడటం లేదా అనే పరీక్షలను మరోసారి వైద్యులు ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచిందో లేదో ఈ తనిఖీలు ఏమిటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తమకు సదరం సర్టిఫికెట్లను ప్రభుత్వం ఇచ్చిన తరువాతే పింఛన్లను మంజూరు చేశారని, అయినప్పటికీ మమ్మల్ని ఇలా ఇబ్బందులకు గురి చేయడం ఎంత మాత్రం సమంజసం కాదని అంధులు వాపోతున్నారు.



ఏరియా ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వచ్చి పడిగాపులు కాస్తున్న దివ్యాంగులు

రోజుకు 60 మందికి పరీక్షలు

నూజివీడు ఏరియా ఆస్పత్రిలో రోజుకు 60 మంది చొప్పున దివ్యాంగుల నేత్రాలను పరీక్షిస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వారితో పాటు మరొకరిని వెంట తీసుకొని రావాల్సి వస్తోంది. ఇప్పటివరకు ఆగిరిపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు రీ వెరిఫికేషన్ చేయగా, ప్రస్తుతం చాట్రాయి మండలానికి చెందిన లబ్ధిదారులను పరీక్షిస్తున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు దూర ప్రాంతాల నుంచి ఏరియా ఆస్పత్రి వద్దకు చేరుకుంటున్నారు. దివ్యాంగుల వెరిఫికేషన్ దాదాపు ఐదు నెలల పాటు కొనసాగనుంది.

2016 నుంచి పింఛన్ తీసుకుంటున్నా



నాకు ఒక కన్ను కనబడదు. 2016లో వికలాంగ కోటా కింద పింఛన్ మంజూరు చేశారు. అప్పటి నుంచి పింఛన్‌ను తీసుకుంటున్నా. పరీక్షలు చేయించుకుంటే సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. దానిని పెట్టి పింఛన్‌కు దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరైంది.

–తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, కోటపాడు, చాట్రాయి మండలం

రీ వెరిఫికేషన్ చేయడం దారుణం



2014 నుంచి వికలాంగ పింఛన్‌ను తీసుకుంటున్నా. నాకు కళ్లు కనబడకపోవడంతో ఇస్తున్నారు. కళ్లు కనిపిస్తూ కళ్లు లేవని చెప్పి ఎవరైనా పింఛన్ తీసుకుంటారా. ఇలా చెకింగ్ చేయడం చాలా దారుణం. పేదల పట్ల ఇలా చేయడం తమను ఎంతో వేదనకు గురిచేస్తోంది.

–చొప్పరపు పెద నరసింహారావు, పర్వతాపురం, చాట్రాయి మండలం

పుట్టుకతోనే చూపు పోయింది



పుట్టుకతోనే ఫిట్స్ రావడంతో నరాలు దెబ్బ తిని చూపుపోయింది. 15 ఏళ్లుగా పింఛన్ వస్తోంది. ఇప్పుడు తమను తనిఖీల పేరుతో ఆస్పత్రి చుట్టూ తిప్పడం దారుణం. ఇప్పటికీ ఫిట్స్ వస్తూనే ఉన్నాయి. జీవితమంతా నరకం చూస్తున్నా. వికలాంగుల్లో అనర్హులు ఎవరూ ఉండరు. – నక్కా కృపావరం, సీ–గుడిపాడు, చాట్రాయి

క్లుప్తంగా

రక్త దానం ప్రాణ దానంతో సమానం



మైలవరం: రక్త దానం ప్రాణ దానంతో సమానమని మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్టీఆర్ జిల్లా సంయుక్త సహకారంతో శనివారం రక్త దాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రక్త దానం చేయడం వలన ఆపదలో ఉన్న వారిని ఆదుకోవచ్చన్నారు. ఆరోగ్యవంతులుగా ఉన్న యువతీ యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్త దానం చేయాలన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. మదన్‌మోహన్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ బి. శివహరిప్రసాద్, ప్రోగ్రాం ఇన్‌చార్జి ఎస్. ఉమామహేశ్వరరెడ్డి, గూడూరు నాగిరెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు థియేటర్లు సీజ్



విస్సన్నపేట: లైసెన్సు రెన్యువల్ లేకుండా విస్సన్నపేటలో సినిమాలు ప్రదర్శిస్తున్న రెండు థియేటర్లను తిరువూరు ఆర్డీఓ కె. మాధురి శనివారం సీజ్ చేశారు. శ్రీరామ్, వెంకటేశ్వర థియేటర్ల యజమానులు లైసెన్సు రెన్యువల్ చేయకపోవడంతో ప్రదర్శనలు నిలిపివేయాలని ఆర్డీఓ ఆదేశించారు. ఆయా థియేటర్లలో ఉదయం సినిమా ప్రదర్శన జరుగుతుండగా ప్రేక్షకులను కలిసిన ఆర్డీఓ టికెట్ ధరలపై ఆరా తీశారు. థియేటర్లలో పారిశుద్ధ్యం, ఆహార భద్రత అంశాలను పరిశీలించారు. ప్యాకింగ్‌పై ఆహార తయారీ వివరాలు లేకపోవడంతో అమ్మకాలు నిలిపివేయాలని ఆదేశించారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థిని ప్రతిభ




గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీల్లో గుంటుపల్లి సెయింట్ ఆన్స్ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని మోగులూరి శ్రేష్ఠ తృతీయ స్థానంలో నిలిచిందని పాఠశాల హెచ్ఎం సిస్టర్ షర్లి తెలిపారు. గొల్లపూడి వడ్లమూడి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎస్‌పీఎస్ఆర్సీ ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అంశంపై జరిగిన వ్యాస రచన పోటీల్లో ప్రతిభ చూపి తృతీయస్థానం సాధించి బహుమతి, సర్టిఫికెట్లు అందుకుంది. విద్యార్థిని శ్రేష్ఠను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

పథకాలపై అవగాహన

తిరువూరు: పాడి రైతుల సంక్షేమానికి కృష్ణా మిల్క్ యూనియన్ పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తిరువూరు క్లస్టర్ మేనేజర్ సాంబశివమూర్తి అన్నారు. గంపలగూడెం మండలం అనుముల్లంకలో పాల ఉత్పత్తిదారులకు యూనియన్ అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. పాడి గేదెలకు చికిత్స సదుపాయంతో పాటు నాణ్యమైన పాలు సరఫరా చేసే రైతులకు ప్రోత్సాహకాలను ఆయన వివరించారు. అనుముల్లంక పాల ఉత్పత్తిదారుల సంఘాధ్యక్షుడు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సూపర్ వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి గుంతతో ఇబ్బందులు



నూజివీడు: పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి దర్శనమిస్తున్న మురుగునీటి గుంతతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నెస్పీ గేటు వద్ద గుంతను ఏర్పాటు చేసి మరీ బాలికల వసతిగృహంలో ఉన్న 80 మంది విద్యార్థినులు వాడిన నీరంతా వదులుతుండటంతో మురుగు నీటి తటాకంలా మారింది. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. గుంత లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేతన జీవులకు ఊరట

మైలవరం: కేంద్ర బడ్జెట్ వేతన జీవులకు ఊరట కలిగేలా ఉందని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు పి.గోపాల్ అన్నారు. మైలవరంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో శనివారం గోపాల్ మాట్లాడుతూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ క్యాన్సర్ మందులు ఇతర ప్రాణాంతక వ్యాధుల మందుల ధరలు తగ్గిస్తుండటం, రైతులకు ఋణ పరిమితి, క్రెడిట్ కార్డులు పరిమితి పెంచడం, ఎంఎస్ఎంఈలు పెంచడం వలన రైతులకు మేలు జరుగుతుందన్నారు. నేషనల్ మారిటోరియమ్ ఫండ్, ఎనర్జీ కమిషన్ ఏర్పాటు వలన, పాఠశాలల్లో అభివృద్ధి కొరకు నిధులు,మధ్య తరగతి వారికి మంచి ఊరట కలిగిందన్నారు.

ఫీజు పోరు వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల ఫీజులు కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడంతో వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 5న ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ కొండపల్లి పట్టణ అధ్యక్షుడు మిక్కిలి శరభయ్య కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఫీజు పోరు వాల్‌పోస్టర్లను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పెండింగ్ లేకుండా విద్యార్థులకు ఫీజులు చెల్లించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఫీజులు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. నాయకులు పోరంకి శ్రీనివాసరాజు, కుంచం జయరాజు, కోమటి కోటేశ్వరరావు, చందా చంటి, జి.రాణి పాల్గొన్నారు.



ఫీజు పోరు వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా పింఛన్ల పంపిణీ

జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని దృష్టిలో ఉంచుకుని సామాజిక పింఛన్లు సజావుగా పంపిణీ చేశామని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మండలంలోని మూలపాడు గ్రామంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి సామాజిక పింఛన్‌దారుల స్థితిగతులు, ప్రతి నెలా అందుతున్న పింఛన్ నగదు వివరాలపై ఆరా తీశారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పంపిణీ జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలించారు. సామర్థ్యం మేరకు పూర్తి స్థాయిలో వర్మి కంపోస్ట్ తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో పారిశుద్ధ్యం నిర్వహణ తీరు, డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదలను పరిశీలించారు. ఇళ్ల నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్త వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీతశర్మ, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, కార్యదర్శి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మూలపాడులో పింఛన్‌దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

సానుకూల దృక్పథం కలిగి ఉండాలి

నూజివీడు: జీవితంలో విజయం సాధించాలంటే ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల అనేవి ప్రధానంగా కలిగి ఉండాలని, ఈ లక్షణాలను విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలని కేఎల్ యూనివర్శిటీ సైకాలజీ ఫ్యాకల్టీ జాస్తి రాజేశ్వరి అన్నారు. పట్టణంలోని ట్రిపుల్ ఐటీలో పీయూసీ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులకు శనివారం వ్యక్తిత్వ వికాసం, జెండర్ సున్నితత్వంలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తి నిలబడటం, మాట్లాడటం, కూర్చోవడం ద్వారా కూడా ఆ వ్యక్తి వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చన్నారు. దేనిలోనైనా ఒకసారి విఫలమైతే మళ్లీ మళ్లీ ప్రయత్నిస్తూనే ఉండాలన్నారు. సానుకూల దృక్పథం ఉన్న వ్యక్తులు ఏ పని చేపట్టినా విజయం సాధిస్తారని, ముఖ్యంగా మహిళలకు సానుకూల దృక్పథం చాలా అవసరమని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ బి.లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ చిరంజీవి, డీఎస్‌డబ్ల్యూ దుర్గాభవాని, బ్రహ్మాస్వాములు, ఎఫ్ఓ నాగార్జునదేవి, పీయూసీ అసోసియేట్ డీన్ అకడమిక్స్ రఘు తదితరులు పాల్గొన్నారు.



సైకాలజీ ఫ్యాకల్టీ రాజేశ్వరిని సత్కరిస్తున్న అధ్యాపకులు

నెలాఖరుకు సభ్యత్వ నమోదు పూర్తిచేయండి

ఇబ్రహీంపట్నం: ఎంసీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి మద్దిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక జిల్లా కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లో మార్చి 19, 20, 21 తేదీల్లో జరుగనున్న పార్టీ పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ, ఏఐసీటీయూ సమావేశానికి ఆయా సంఘాల సభ్యులు హాజరు కావాలన్నారు. మార్చి 30న విజయవాడలో జరుగనున్న భారత ఐక్య యువజన సమాఖ్య సదస్సుపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మార్చి 27న ఢిల్లీలో తలపెట్టిన నిరసన కార్యక్రమ కరపత్రాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఫిబ్రవరి 26న జరుగనున్న విజయవాడ నగర రెండో మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఎంసీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గొల్లపూడి ప్రసాద్, యువజన విభాగం రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్‌బాబు, కలకంటి బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ప్రలోభాల పర్వం

వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లకు ఎర

నూజివీడు: నూజివీడు మున్సిపాలిటీ వైస్ చైర్మన్ పదవికి సోమవారం ఎన్నిక నిర్వహించనున్న నేపథ్యంలో ప్రలోభాల పర్వం ప్రారంభమైంది. వైఎస్సార్ సీపీకి చెందిన కౌన్సిలర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు అధికార పార్టీ నాయకులు ఎర వేస్తున్నారు. తమకు టచ్‌లోకి రాని కౌన్సిలర్లను ఎలాగైనా తమ వైపునకు తిప్పుకునేందుకు సామదాన భేద దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. నూజివీడు మున్సిపాలిటీలో మొత్తం 32 వార్డులు ఉండగా 25 వార్డులు వైఎస్సార్ సీపీ, 7 వార్డులు టీడీపీ గెలుచుకుంది. అయితే వైఎస్సార్ సీపీకి చెందిన ఒక కౌన్సిలర్ ఎన్నికల ముందే టీడీపీలో చేరడంతో 8 వార్డులు టీడీపీకి ఉండగా, 24 వార్డులు వైఎస్సార్ సీపీకి ఉన్నాయి. ఏడాది కిందట రెండు వైస్ చైర్మన్ల పదవులకు గాను ఒక వైస్ చైర్మన్ పదవి ఖాళీ ఏర్పడింది. దీంతో దానికి ప్రస్తుతం ఎన్నికల సంఘం ఎన్నిక నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎలాగైనా రెండో వైస్ చైర్మన్ పదవిని కైవసం చేసుకోవాలనే లక్ష్యంతో అధికార పార్టీ నాయకులు ప్రలోభాలకు తెరతీశారు. డబ్బులకు లొంగని వారిపై ఇతర మార్గాల్లో ఒత్తిడి తీసుకుని వస్తున్నారు. అనేక మంది వారి ప్రలోభాలకు ఎంతమాత్రం లొంగడం లేదు. ఇరు పార్టీలు తమకు అందుబాటులో ఉన్న ఇప్పటికే కౌన్సిలర్లను శిబిరాలకు తరలించాయి.

ట్రక్కు ఆటో బోల్తా: డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

జి.కొండూరు: మండల పరిధి హెచ్. ముత్యాలంపాడు, కందులపాడు గ్రామాల మధ్య బుడమేరుపై ఉన్న వంతెన వద్ద ఫ్రూట్స్ రవాణా చేస్తున్న ట్రక్కు ఆటో శనివారం మధ్యాహ్నం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తృటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మైలవరం మండల పరిధి చంద్రగూడెంకు విజయవాడ నుంచి ఈ ఆటో ఫ్రూట్స్‌ను రవాణా చేస్తున్నట్లు తెలిసింది.



వంతెన వద్ద బోల్తా పడిన ట్రక్కు ఆటో

వంతెన వద్ద తరచూ ప్రమాదాలు

అయితే ఈ వంతెన వద్ద నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ ప్రదేశంలో శిథిలావస్థకు చేరిన వంతెన స్థానంలో నూతన వంతెన నిర్మించేందుకు ఆలస్యమవుతోందని లో లెవెల్ చప్టాను నిర్మించారు. అయినప్పటికీ ఇటీవల బుడమేరుకు వచ్చిన వరద ప్రవాహంతో లో లెవెల్ చప్టాకు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. దీనితో అధికారులు తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డును మట్టితో ఏర్పాటు చేశారు. నిత్యం భారీ వాహనాలు ఈ లో లెవెల్ చప్టా మీదుగా రాకపోకలు సాగించడం వల్ల చప్టాకి ఇరువైపులా అప్రోచ్ రోడ్డుకు భారీ గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. లో లెవెల్ చప్టాపై భారీ వాహనాల రాకపోకలు జరుగుతున్న క్రమంలో కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటి వాహనాలతో పాటు, నడిచి వెళ్లే స్థానికులు సైతం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన వంతెనపైనే రాకపోకలు సాగిస్తున్నారు. పాత వంతెన స్థానంలో హై లెవెల్ వంతెన నిర్మాణం ప్రతిపాదనల దశలోనే ఉండడంతో ఈ ప్రదేశంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టాలని కోరుతున్నారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

ఆగిరిపల్లి: మండలంలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వారి మాఘమాస రథసప్తమి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం స్వామి వారి కల్యాణ మండపంలో శాంతి కల్యాణాన్ని సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి యాదవ సంఘం ఆధ్వర్యంలో స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరించి అశ్వ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ వేద పండితుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ సాయి పర్యవేక్షించారు.



స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సారా విక్రయిస్తున్న మహిళల అరెస్ట్

ముసునూరు: సారా, అక్రమ మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో మెరుపు దాడులు చేసి ఇద్దరు మహిళలను అరెస్ట్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య తెలిపారు. శనివారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీఎస్ఎస్ ఫణికుమార్ ఆధ్వర్యంలో ముసునూరులో కంచర్ల పార్వతి ఇంటి వద్ద సోదా చేసి మూడు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సాయంత్రం జిల్లా ఈఎస్‌టీఎఫ్ సీఐ ఆర్.సత్యవతి ఆధ్వర్యంలో చెక్కపల్లిలో దాడి చేసి అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న చిలుకబత్తుల తులిశమ్మను అదుపులోకి తీసుకుని 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం, సారా విక్రయాలు, బెల్ట్‌షాపులు నిర్వహిస్తే దాడులు జరిపి, కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం



ఆగిరిపల్లి: స్థానిక బ్రాహ్మణ బజార్‌లోని విజయవాడ–నూజివీడు రహదారి పక్కనే దమ్మన్న మండపం వద్ద డ్రెయినేజీ పై శ్లాబ్ లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈ నెల 5న శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి వారి రథోత్సవం దమ్మన్న మండపం పక్కనే ఉన్న రహదారి మీదుగా సాగుతుంది. రథోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. రథం లాగే సమయంలో భక్తులు ఆ డ్రెయినేజీలో పడిపోయే ప్రమాదం ఉందని, వెంటనే డ్రెయినేజీపై సిమెంట్ పలకలు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘించవద్దు

విస్సన్నపేట: కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికల నోటిఫికేషన్ అమలులోకి వచ్చినందున రాజకీయ పార్టీలు నిబంధనలను తప్పక పాటించాలని విస్సన్నపేట తహసీల్దారు లక్ష్మి కల్యాణి పేర్కొన్నారు. విస్సన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బహిరంగ సమావేశాలు, సభలు జరపరాదని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి దాతల విరాళాలు

తిరువూరు: స్థానిక జగన్నాథపురం కాలనీలో పునర్నిర్మాణంలో ఉన్న దాసాంజనేయస్వామి ఆలయానికి పలువురు దాతలు విరాళం ఇచ్చారు. వ్యాపారవేత్త జంగాల మురళీకృష్ణ రూ.20,116, సోమవరపు చిన నరసింహారావు రూ.10,116, సోమవరపు వెంకట నాగేశ్వరరావు రూ.5,116, కె. చిరంజీవరావు రూ.60 వేలు, కొంకిమళ్ల పద్మావతి, రత్నాకర్, కృష్ణ రూ.5,116, డాక్టర్ వివేకానంద రూ.10,116 విరాళాలు అందజేశారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు తెలిపారు.

అధ్యాపకుడు కోటేశ్వరరావుకు డాక్టరేట్



తిరువూరు: స్థానిక శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకుడు ఆనం కోటేశ్వరరావుకు రసాయన శాస్త్రంలో అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ లభించింది. సాంకేతిక రంగంలో మారుతున్న నైపుణ్యాలను విద్యార్థులకు అందించే విధంగా ఆయన పరిశోధన పత్రం సమర్పించారు. ఆయనను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కోశాధికారి ముత్యాల కిశోర్‌బాబు అభినందించారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గెస్ట్ లెక్చరర్‌గా పని చేసేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం తెలిపారు. కనీసం 55 శాతం మార్కులలో కంప్యూటర్ సైన్స్‌లో పీజీ ఉత్తీర్ణులై ఉండాలని, ఏపీ సెట్, యూజీసీ సెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు గరిష్ఠంగా నెలకు రూ.14,500 గౌరవ వేతనం ఇస్తామన్నారు. ఈ నెల 3వ తేదీ ఉదయం 10 గంటలకు డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరు కావాలని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99591 08829 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

రేపు విగ్రహాల ప్రతిష్ఠ

మైలవరం: పొందుగల పంచాయతీ శివారు అనంతవరం గ్రామంలో ఈ నెల 3న నూతనంగా నిర్మించిన శివాలయంలో పార్వతిదేవి సమేత అనంతేశ్వరస్వామి వార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ శనివారం తెలిపింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

దోమల బెడద నివారించాలని వినతి

తిరువూరు: పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉన్నందున నగర పంచాయతీ అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకులు అన్నవరపు సత్యనారాయణ కమిషనర్ లోవరాజుకు విజ్ఞప్తి చేశారు. శనివారం తిరువూరు పట్టణ పార్టీ నాయకులతో కమిషనర్‌ను కలిసిన సత్యనారాయణ స్థానిక సమస్యలను వివరించారు. 15, 18 వార్డులలో మురుగు కాలువలు లేక పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, దేవాలయాల సమీపంలో చెత్తచెదారం వేయడం, మురుగునీరు పారే వీలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. తిరువూరులో గోవధ జరుగుతున్నందున చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ముసునూరు: మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు ఆపన్న హస్తం అందించారు. చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన చిమటా రంగారావు (45)అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తొర్లపాటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు శనివారం మృతుని ఇంటికి వెళ్లి, కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.6 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు. సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, కంపచాటి గంగరాజు, జోనుబోయిన తిరుమలరావు, నాగేంద్రరావు, తులిమెల్లి పంగిడయ్య, ఎలికే సురేష్ తదితరులు పాల్గొన్నారు.

300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: మండలంలోని సారా తయారీ కేంద్రాలపై దాడులు చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోతనపల్లి గ్రామంలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామని చెప్పారు. దాడుల్లో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి నిందితుడు ధారావతు తావురుపై కేసు నమోదు చేశామన్నారు.

'కల్యాణ మస్తు' అందజేత

చాట్రాయి: మండలంలోని తుమ్మగూడెం పాల కేంద్రంలో పాలు పోస్తున్న ములుగుమాటి ప్రసాద్ కుమార్తె దీప్తి వివాహం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో బంగారు నాణేన్ని శనివారం అందించారు. కల్యాణమస్తు పథకంలో భాగంగా రూ.20 వేలు విలువైన నాణేన్ని అందజేశారు. కార్యక్రమంలో తిరువూరు పాల కేంద్రం మేనేజర్ టి.సాంబశివమూర్తి పాల్గొన్నారు.

89 శాతం పింఛన్ల పంపిణీ

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం 89 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. స్థానిక విలేకరులతో ఆమె మాట్లాడుతూ మొత్తం 8,302 పెన్షన్లకు గాను 7,462 పెన్షన్లు పంపిణీ చేశామన్నారు. మిగిలిన వారికి సోమవారం అందిస్తామని చెప్పారు.